క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి


బూత్ కమిటీ జాబితాను పరిశీలిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

డుంబ్రిగుడ: మండలంలోని పంచాయతీ, గ్రామాల వారీగా ఇటీవల ఏర్పాటుచేసిన బూత్ కమిటీ జాబితాను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.పరశురామ్, వైస్ ఎంపీపీ శెట్టి ఆనంద్‌రావు, గుంటసీమ సర్పంచ్ గుమ్మ నాగేశ్వరరావు ఆదివారం అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారితో మాట్లాడుతూ ఉత్సాహవంతులైన యువతకు బూత్ కమిటీలో తగు ప్రాధాన్యత కల్పించాలని, మండలంలోని పార్టీని మరింతగా బలోపేతం చేయాలని వారికి ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ


అనారోగ్యంతో బాధపడుతున్న శామ్యూల్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

హుకుంపేట: మండలంలోని గూడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఒంటుబు శామ్యూల్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. శస్త్ర చికిత్స అనంతరం తమ నివాసంలో విశ్రాంతి పొందుతున్న విషయం తెలుసుకున్న అరకు మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదివారం గ్రామానికి చేరుకుని ఆయనను కలిసి పరామర్శించారు. అనంతరం తన ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. తమకు అండగా ఉంటానని ధైర్యం చెప్పి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నాయకులు రామకృష్ణ, చిన్నయ్య, సింహాచలం, రాజారావు, కోటిబాబు, ప్రియాంక తదితరులున్నారు.

ప్రజా సమస్యలపై పోరాటం


శ్రీరాములు

గూడెంకొత్తవీధి: పెదవలస పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా కంకిపాటి శ్రీరాములు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శ్రీరాములు ఆదివారం మాట్లాడుతూ పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన బాధ్యతలను పూర్తిస్థాయిలో నిర్వహిస్తామన్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. పార్టీ శ్రేణులతో కలిసి చంద్రబాబు మోసాలను గ్రామాల్లో ఎండగడతామన్నారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు.

సురవరం మృతి పార్టీకి తీరని లోటు


సంతాప సభలో నినాదాలు చేస్తున్న నాయకులు

కొయ్యూరు: సీపీఐ దిగ్గజం సురవరం సుధాకర్ రెడ్డి మృతి సీపీఐకి తీరని లోటని జిల్లా కార్యవర్గ సభ్యులు ఉల్లి సత్యనారాయణ అన్నారు.అంతాడ పంచాయతీ మునసలలో ఆదివారం సురవరం సుధాకర్‌రెడ్డి సంతాప సభను ఏర్పాటు చేశారు.ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురవరం విద్యార్థి దశ నుంచి ఉద్యమబాట పట్టారన్నారు. సీపీఐ తరపున నల్లగొండ నుంచి రెండుసార్లు ఎంపీగా చేసి సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేశారన్నారు. నేటి యువత అతనిని ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. నాయకుడు సూరిబాబు, దేముడు, నానాజీ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల నిర్మాణం పూర్తి చేయాలి

నర్సీపట్నం: ఈనెల 26న చేపట్టిన మాకవరపాలెం మండలం, భీమబోయినపాలెంలో అసంపూర్తిగా నిలిచిన మెడికల్ కళాశాల సందర్శనను విజయవంతం చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక జిల్లా కన్వీనర్ ఎస్.కె.శాస్త్రి పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం కళాశాల నిర్మాణాన్ని నిలిపివేయడం సరికాదన్నారు. కాలేజీ నిర్మాణం పూర్తి అయితే ఈ ప్రాంత ప్రజలకు అత్యున్నత వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో పాటు వైద్య విద్య వల్ల ఎంతో మంది పేద పిల్లలకు న్యాయం చేకూరుతుందన్నారు. కళాశాల నిర్మాణాన్ని చేపట్టాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఈ సందర్శన చేపట్టామన్నారు. అన్ని వర్గాల వారు ఉమ్మడిగా స్పందిస్తే ఫలితం ఉంటుందన్నారు. ఈ సందర్శనకు హాజరై మీ విలువైన అభిప్రాయాలను తెలియజేయాలన్నారు.

సమస్యలతో సహవాసం


బీటా గ్రామంలో అసంపూర్తి భవనంలో రేకులను అడ్డుపెట్టుకొని సాగుతున్న తరగతులు


కోతకు గురైన డి.అగ్రహారం వంతెన

- అసంపూర్తి భవనంలోనే చిన్నారుల చదువులు
- ప్రమాకరంగా డి.అగ్రహారం వంతెన
- ఆందోళనలో వాహనచోదకులు
- వీధుల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలు
- పట్టించుకోని అధికారులు


బీటా గ్రామంలో అసంపూర్తి అంగన్‌వాడీ భవనం ఇదే

ముంచంగిపుట్టు: జిల్లాలోని పలు ప్రాంతాల్లో వివిధ రకాల సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. పలు ప్రాంతాల్లో అధ్వాన రహదారులు, శిథిలావస్థ రహదారు, అసంపూర్తి భవనాలు, కొన్నిచోట్ల రోజులతరబడి చెత్త తొలగించక పేరుకుపోయిన చెత్త కుప్పలు వద్ద తీవ్ర దుర్గంధంతో స్థానికులు సతమతమవుతున్నారు. ఇందులో భాగంగా ముంచంగిపుట్టు మండలంలోని సుజనకోట పంచాయతీ బీటా గ్రామంలో ఉన్న ఎంపీపీ పాఠశాలకు పక్కా భవనం లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. భవన సమస్యతో గ్రామస్తుల సహకారంతో ఉపాధ్యాయులు అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనంలోనే చదువులు సాగుతున్నాయి. గతంలో 40 మంది విద్యార్థులు ఉండే పాఠశాల నేడు 8 మంది మాత్రమే ఉన్నారు. చదువుకునేందుకు భవన సమస్యతో ఏడాది ఏడాదికి విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వస్తుంది. పాఠశాలకు భవనం మంజూరు చేయాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు. అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనంలో రేకులు అడ్డుపెట్టుకుని, వర్షానికి, చలికి, ఎండకు ఇబ్బందులు పడుతూనే గిరిజన విద్యార్థుల చదువులు సాగుతున్నాయి. విద్యాశాఖ ఉన్నత అధికారులు స్పందించి వెంటనే పాఠశాలకు భవన సమస్య తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

సీలేరు : ఏజెన్సీ మారుమూల గిరిజన గ్రామాల్లో భారీ వర్షాలకు వంతెనలు కోతకు గురైనా సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని సంబంధిత అధికారులకు స్థానికులు విన్నవించినా కనీసం స్పందించడం లేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు. గూడెం కొత్తవీధి మండలం దారకొండ పంచాయతీ బి.అగ్రహారం వంతెన గతేడాది సెప్టెంబర్ నెలలో భారీ వర్షాలకు సగభాగం కోతకు గురైంది. అందులో ఉన్న రెండు తుంపర్లు దెబ్బతిన్నాయి. అప్పటినుంచి ఆ వంతెనపై భయంగా వాహన రాకపోకలు జరుగుతున్నాయి. వారం రోజుల కిందట అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఈ వంతెన పైనుంచి వర్షపు నీరు ప్రవహించింది. ఇలాంటి సమయంలో ఈ వంతెన మరింత ప్రమాదకరంగా మారింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి కోతకు గురైన ఈ వంతెనను మరమ్మతులు చేపట్టకపోతే తర్వాత కురిసే వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయే అవకాశం ఉందని ఆరోపిస్తున్నారు. పక్క పంచాయతీలో చిన్న గంగవరం వంతెన పూర్తిగా కొట్టుకుపోయినట్టు జరిగితే మా గ్రామాలకు రాకపోకలు సాగించేందుకు వేరే మార్గం ఉండదని చెబుతున్నారు. ఈ వంతెన మీదుగా అగ్రహారం, కోరాపల్లి, కుమ్మరాపల్లి, పెద్దగొంది, జి.నేరేడుపల్లి, ఎస్.నేరేడుపల్లి, కాట్రగడ్డ జంక్షన్ మీదుగా ఒడిశా వెళ్లేందుకు ప్రధాన మార్గం. ప్రమాదకరంగా ఉన్న ఈ వంతెనపై ఆందోళనతో వాహనచోదకులు రాకపోకలు సాగిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కోతకు గురైన ఈ వంతెనను పూర్తిస్థాయిలో మరమ్మతు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


దుంబ్రిగుడ పీహెచ్‌సీ పరిసరాల్లో చెత్తకుప్పలు

దుర్గంధంతో సతమతం

దుంబ్రిగుడ: మండల కేంద్రంలోని పారిశుధ్యం కొరవడింది. గ్రామాల్లోని వీధుల్లో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. స్థానికులు తీవ్ర దుర్గంధంతో సతమతమవుతున్నారు. రోజుల తరబడి చెత్త తొలగించకపోవడంతో పరిస్థితి అధ్వానంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు వీధుల్లో చెత్త కుప్పలతో దారుణంగా మారాయి. ఇందులో భాగంగా మండలంలోని పీహెచ్‌సీ వద్ద చెత్త కుప్పలు పేరుకుపోవడంతో రోగులు ముక్కుమూసుకొని వెళ్లాల్సి వస్తోంది. ఆస్పత్రికి వచ్చే వారి పరిస్థితి దారుణంగా ఉందని పలువురు చెబుతున్నారు. ఇక్కడ రోజుల తరబడి చెత్త తొలగించకపోవడంతో ఈ పరిసరాలు అధ్వానంగా ఉన్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

మోసపూరిత హామీలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం


సంపంగిపుట్టులో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్ ఎంపీపీ సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మత్స్యకొండంనాయుడు, నేతలు

జి.మాడుగుల: ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు అబద్ధాల హామీలు గుప్పించి మోసం చేసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, నేడు చంద్రబాబు మోసాలు తెలుస్తున్నాయని వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నుర్మని మత్స్యకొండం నాయుడు, సర్పంచ్ సీదరి కొండబాబు అన్నారు. మండలంలో గెమ్మెలి పంచాయతీ సంపంగిపుట్టు గ్రామంలో పాడేరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆదేశాల మేరకు ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు చేస్తున్న మోసాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్ని గాలిలో కలసిపోయాయని ధ్వజమెత్తారు.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో పార్టీలు, కులాలకు అతీతంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తే నేడు కూటమి ప్రభుత్వం పథకాలకు తిలోదకాలు ఇచ్చిందన్నారు. నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో దివ్యాంగులు, వృద్ధుకు అర్హులందరికీ ఇంటింటికి వెళ్లి పెన్షన్లు సొమ్మును అందజేస్తే.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అనేక మంది పెన్షన్లు రద్దుచేసి వారి పొట్టకొట్టిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు మోసాలపై రూపొందించిన క్యూ ఆర్ కోడ్ పోస్టర్‌ను నాయకులు ఆవిష్కరించారు. సర్పంచ్ సీదరి కొండబాబు, నాయకులు లక్ష్మినాయుడు, పలసయ్య, బాలయ్యపడాల్, భాస్కరరావు, పాత్రుడు, నాగంనాయుడు, అనిల్, సత్తిబాబు, కోటిబాబు, మురళి, అప్పలనాయుడు, పీసీ కమిటీ నాయకులు సూరిపడాల్, అప్పారావు పాల్గొన్నారు.

ఘనంగా బోడకొండమ్మ పండగ


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మాకవరపాలెం: మండలంలోని జీకోడూరులో బోడకొండమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. పండగ సందర్భంగా ఆదివారం ఉదయం నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని గ్రామంలోని అన్ని వీధుల్లోనూ డప్పుల వాయిద్యాలు, కోలాటాల నడుమ వైభవంగా ఊరేగించారు. మధ్యాహ్నం జరిగిన భారీ అన్నసమారాధనలో భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఊరేగింపులో చిన్నారుల కోలాటం అందరినీ ఆకట్టుకుంది. పండగలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మోదకొండమ్మకు ప్రత్యేక పూజలు

మాడుగుల: మోదమాంబ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామస్తులతో పాటు చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన భక్తులు ఓడ్లు పండగలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

మధుమేహ వ్యాధిపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయుడు రాము

మాకవరపాలెం: మధుమేహ వ్యాధిపై అవగాహనకు పాఠశాలల్లో సుగర్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. చిన్నప్పటి నుంచి మధుమేహం వ్యాధిపై తెలియజేసేందుకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ సుగర్ షుగర్ బోర్డులు ఏర్పాటు చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. ఈ నేపథ్యంలో తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో షుగర్ బోర్డు ఏర్పాటు చేసినట్టు పాఠశాల ఉపాధ్యాయుడు కె.రాము తెలిపారు. షుగర్ వ్యాధి కారణంగా కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరిస్తున్నామన్నారు. తీపి పదార్థాలు అధికంగా తినడం వల్ల ఊబకాయం వచ్చి, పిల్లలు పడే ఇబ్బందులను తెలియజేస్తున్నట్టు చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

రావికమతం: కొత్తకోట హైస్కూల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కొత్తకోట హైస్కూల్లో 1984-1985 విద్యా సంవత్సరంలో 100 మంది విద్యార్థులు పదో తరగతి వరకు చదివారు. వీరంతా ఏళ్ల తరువాత అంతా కలుసుకున్నారు. వీరిలో కొందరు ప్రభుత్వ ఉద్యోగులుగా, వ్యాపారులుగా, గృహిణులుగా వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. ఆదివారం ఉదయాన్నే కొత్తకోటలో కలుసుకుని విద్యాభ్యాసం నాటి రోజులను నెమరువేసుకున్నారు. పలువురు కుటుంబాలతో వచ్చారు. ఒకరినొకరు పరిచయాలు చేసుకొని ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. మధ్యాహ్నం అంతా కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. విద్యాబుద్ధులు నేర్పించిన గురువులు సూర్యనారాయణ, ఆర్.వి.స్వామి దంపతులకు ఆత్మీయక సమ్మేళనానికి ఆహ్వానించి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కోట వెంకటరమణ, పరవాడ నారాయణదొర, కోట సత్యనారాయణ, వీరణాల గోవింద, వాసంశెట్టి శ్రీనివాసరావు, అలమండ శ్రీను, మలసాల కిషోర్ చొరవతో ఆత్మీయ కలయక కార్యక్రమం జరిగింది. ప్రతి ఏటా కలుసుకోవాలని నిర్ణయం తీసుకున్నారు.


కొత్తకోట హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

పలు గ్రామాల్లో జోరుగా వరినాట్లు

కె.కోటపాడు: ఇటీవల అల్పపీడన ద్రోణి కారణంగా కురిసిన వర్షాలు మెట్ట ప్రాంత గ్రామాల్లో వరినాట్లు వేసే రైతులకు మేలు చేసాయి. వరుసగా మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడడం కారణంగా సాగునీటి చెరువుల్లోనికి నీరు చేరుకుంది. పొలాల్లో దమ్ములకు అవసరమైన వర్షపునీరు చేరుకోవడంతో ట్రాక్టర్లు, టిల్లర్లతో దమ్ములను చేపడుతున్నారు రైతులు. ప్రధానంగా మెట్ట ప్రాంత గ్రామాలైన వి.సంతపాలెం, ఉగ్గినవలస, డి.అగ్రహారం, ఆర్.వై.అగ్రహారం గ్రామాల్లో ప్రస్తుతం వరినాట్లు పూర్తి చేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. వాతావరణ పరిస్థితులు సహకరించి ఈ ఏడాది ఖరీఫ్‌లో మంచి దిగుబడితో కూడిన వరిపంట దక్కాలని సాగు రైతులు పేర్కొంటున్నారు.


వి.సంతపాలెం నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్న రైతులు

వైభవంగా శ్రీకృష్ణుడి ఊరేగింపు


కృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న, త్రైత సిద్ధాంత భక్తులు

మాకవరపాలెం: శ్రీకృష్ణుని ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. మండలంలోని అడిగర్లపాలెంలో ఏటా త్రైత సిద్ధాంత భక్తులు కృష్ణాష్టమి రోజున కృష్ణుడి ప్రతిమతో మండపం ఏర్పాటు చేసి తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం అడిగర్లపాలెం, పోతలూరు, మామిడిపాలెంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఘనంగా ఊరేగింపు చేశారు. ఈ ఊరేగింపులో పిల్లలు, పెద్దలు వివిధ వేషధారణలతో పాల్గొన్నారు. మహిళలు నిర్వహించిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు అడిగర్ల చినదేముడు, కచ్చళ్ల సూరిబాబు అధిక సంఖ్యలో త్రైత సిద్ధాంత భక్తులు పాల్గొన్నారు.

జోరందుకున్న వినాయక విగ్రహాల అమ్మకాలు


మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉంచిన గణపతి విగ్రహాలు

రాజవొమ్మంగి: చవితి ఉత్సవాలకు మన్యంలో అన్ని గ్రామాలు సిద్ధమవుతున్నాయి. ఈ మేరకు మార్కెట్‌లో గణనాథుల ప్రతిమలు, విగ్రహాల అమ్మకాలు సాగుతున్నాయి. ఈనెల 27వ తేదీ బుధవారం జరుగనున్న గణపతి నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఇప్పటికే గ్రామగ్రామాల్లో మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. మండపాలను పూలతో, రంగురంగుల విద్యుద్దీపాలతో సర్వాంగసుందరంగా అలంకరిస్తున్నారు. ఈ మండపాల్లో ప్రతిష్ఠించేందుకు భారీ గణపతిని పట్టణాల నుంచి తీసుకొని రావడానికి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయి. చవితి ఉత్సవాల ఏర్పాట్లతో ఏ గ్రామంలో చూసినా సందడి నెలకొంది. ముఖ్యంగా యువత పోటీ పడుతూ ఈ ఏర్పాట్లలో చేయి చేయి కలుపుతున్నారు. పెద్దల సహకారం తీసుకొని చవితికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

రంపచోడవరం నియోజకవర్గాన్ని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలి


అడ్డాకులపై రాసిన వినతిపత్రాన్ని ఎస్టీ చైర్మన్ బొజ్జిరెడ్డికి అందజేస్తున్న ప్రజాప్రతినిధులు


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటలక్ష్మి

రాజవొమ్మంగి: రంపచోడవరం నియోజకవర్గాన్ని ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలని రాజవొమ్మంగి ఎంపీపీ గోము వెంకటలక్ష్మి కోరారు. రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఆదివాసీ జేఏసీ నాయకుడు వెదుళ్ల లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక జిల్లా సాధన కమిటీ సమావేశంలో ఆమె ఆదివారం మాట్లాడారు. ప్రత్యేక జిల్లా పై భవిష్యత్ కార్యాచరణ ప్రకటించాలని ఆమె కోరారు. అనంతరం నాయకులతో కలిసి ఎస్టీ చైర్మన్ బొజ్జిరెడ్డికి అడ్డాకులపై రాసిన వినతిపత్రాన్ని అందజేశారు. నాయకుడు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రవిబాబు పరామర్శ


విజయ్‌కుమార్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కుంభా రవిబాబు

అరకులోయ: అరకులోయ టౌన్ ఎంపీటీసీ దూరియా ఆనంద్ కుమార్ సోదరుడు విజయ్ కుమార్ అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకొన్న ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు ఆదివారం అరకులోయ పట్టణం గ్రీన్‌వ్యాలీ వద్ద స్వగృహానికి వెళ్లి దూరియా విజయ్‌కుమార్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పాంగి చిన్నారావు, జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధికార ప్రతినిధి శెట్టి అప్పాలు, అరకులోయ మండల ఉపాధ్యక్షుడు గుడివాడ ప్రకాశ్, నాయకులు గురునాయుడు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణాలకు విరాళాలు

మునగపాక: మండలంలోని పలు దేవాలయాల నిర్మాణాలకు భక్తులు తమవంతు విరాళాలు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా మునగపాక బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న కలియుగ దైవం వెంకన్న ఆలయానికి ఇదే ప్రాంతానికి చెందిన ఆడారి అప్పారావు కుమారుడు సన్యాసిరావు ఆదివారం రూ.10,116 విరాళంగా అందజేశారు. తోటాడ-గవర్ల అనకాపల్లి గ్రామాల పరిధిలోని మరిడిమాంబ ఆలయ నిర్మాణానికి తోటాడ ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి కుమారులు శేషు, జగదీష్ రూ.20,116 విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

గూడుపమ్మ ఆలయానికి భక్తుల తాకిడి


గూడుపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

నక్కపల్లి: మండలంలో రేబాకలో వనదేవత గూడుపమ్మ తల్లి ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. నక్కపల్లి, అడ్డురోడ్డు, ఎస్.రాయవరం, పాయకరావుపేట, ఉపమాక, తుని తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సర్పంచ్ తళ్ల భార్గవ్, ఉపమాక దేవస్థానం అర్చకులు కృష్ణమాచార్యులు తదితరులు దర్శించుకున్నారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో వంటావార్పు చేసి సహపంక్తి భోజనాలు చేసి సాయంత్రం తిరుగు పయనమయ్యారు.

ఉత్తమ చిత్రాలను ఆదరించాలి


మాట్లాడుతున్న అనకాపల్లి ఫిలిం సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి తమ్మన సుబ్బారావు

అనకాపల్లి టౌన్: ఉత్తమ చిత్రాలను ప్రేక్షకులు ఆదరించాలని అనకాపల్లి ఫిలింసొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి తమ్మన సుబ్బారావు అన్నారు. స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఫిలిం సొసైటీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సొసైటీ ద్వారా 2009 నుంచి 2019 పదేళ్ల పాటు పలు జాతీయ, అంతర్జాతీయ చిత్రాలను ప్రజలకు అందించామన్నారు. ఫిలింసొసైటీ కార్యదర్శి పి.ఎస్. అజయ్ కుమార్ మాట్లాడుతూ ఆంగ్ల ఉపాధ్యాయునిగా వందలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన కమాలకర్ మాస్టార్ మృతి చెంది ఐదేళ్లు కావస్తోందని, ఆయన సొసైటీకి విశేష సేవలందించారని చెప్పారు. ఆయన చేసిన సేవలకు గుర్తుగా ఈ నెల 31న 35 చిన్న కథ కాదు చిత్రాన్ని ప్రదర్శిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. సొసైటీ అధ్యక్షురాలిగా సరిపల్లి సూర్యకుమారి, ఉపాధ్యక్షుడిగా వేణు మాస్టార్, కార్యదర్శిగా ఐ.ఆర్. గంగాధర్, కోశాధికారిగా శ్రీధరాల సూర్యనారాయణలను ఎన్నుకున్నారు.

ఐకమత్యంతోనే రంపచోడవరం జిల్లా సాధన


నినాదాలు చేస్తున్న ఆదివాసీ సంఘాల నేతలు

అడ్డతీగల: ఐకమత్యంతోనే రంపచోడవరం జిల్లా సాధన సాధ్యమవుతుందని ఆదివాసీ(గిరిజన)సాంస్కృతిక సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తుల ఆదిరెడ్డి అన్నారు. స్థానిక ఆదివాసీ భవనంలో సంఘం సమావేశం ఆదివారం నిర్వహించారు. రంపచోడవరం జిల్లా సాధనకు ఒక ప్రణాళికతో ఉద్యోగస్తుల పూర్తి సహకారంతో ముందుకు సాగాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు అన్నారు.అల్లూరి ఉద్యమ స్ఫూర్తి అవసరమన్నారు.రంపచోడవరం నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరంలో కలపడం వల్ల ఆదివాసీలు అన్ని విధాలుగా నష్టపోతారన్నారు. గ్రామస్థాయి నుంచి ఆదివాసీలను చైతన్యవంతులను చేసి ఉద్యమ నిర్మాణం చేయాలని పలువురు సంఘ నేతలు అభిప్రాయపడ్డారు. వేరే జిల్లాలో విలీనం వల్ల కలిగే నష్టాలను వివరించారు. నాయకులు కాటంరెడ్డి, కృష్ణ, పొట్టిదొర, అగ్గిదొర, అప్పన్నదొర తదితరులు పాల్గొన్నారు.